త్రమ పెద్దమ్మాయి సంబంధం కోసం పరంధామయ్యగారు తిర గని వూరు లేదు. చెప్పులేకాదు కాళ్ళు కూడా అరిగిపోయాయి గాని ఏలైన సంబంధం మాత్రం 'దొరక' లేదు.

# ద్విపాత్రాభినయం



సింహ ప్రసాద్

ఆడపిల్ల తండ్రై పుట్టికన్నా అడవిలో మానై పుట్టడం లక్ష రెట్లు మెరుగనుకు న్నారు లక్షసార్లు విసిగి వేసారి.

ఆయనా ఆయన పెళ్ళికి కట్నం తీసు కున్న మాట నిజమేగాని. కట్నంకాక మరీ ఇన్ని లాంఛనాలూ, గొంతెమ్మకోర్కెలూ ఆయనెరుగరు. ఒక్కొక్కళ్ళు బయట పెడుతోన్న కోర్కెల లిస్టు చూస్తోంటే కళ్ళు తిరగటమేకాదు. "జన్మ జన్మలకీ ఏ జన్మ నిచ్చినా సరేగాని ఆడపిల్ల తండ్రి జన్మ మాత్రం ఇచ్చినా ఇవ్వకు స్వామీ" అని లార్డ్ వెంకటేశ్వరుణ్ణి ప్రార్థిస్తున్నారు పదేపదే. అయినా అది వచ్చే జన్మకి ఎడ్వాన్స్ రిక్వెస్ట్ గనుక ఈ జన్మ తాలూకూ బాధ్య తల్ని ప్రస్తుతం నిర్వర్తించక తప్పదు గనుక పట్టువదలని విక్రమార్కుడిలా వరాన్వేషణ చేస్తూనే వున్నారు.

అయినా త్వరగా కలిసి రాకపోయేసరికి సహనం నశించడంతో "నాకే గనుక శక్తి లేక పవర్ వుంటేనా ఈ గొంతెమ్మ కోర్కెల గాళ్ళందర్నీ రాళ్ళు, రప్పలుగా శపించి పారేద్దును" అనుకుంటున్నారు. ఆ తర్వాత వుస్సురని నిట్టూరుస్తున్నారు.

అటువంటి సమయంలో ఆయన స్నేహి తుడు రమణయ్య గారొచ్చారు వస్తూనే "వెళ్ళిన పనేమయిందీ" అంటూ. ఆ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చున్నారు.

"ఏముద్దీ షరా మామూలే. ఛాఛాఛా- ఒక్కళ్ళకీ బుద్ధుల్లేవనుకో రమణయ్యా! వీళ్ళల్లు బంగారంగాను వూళ్ళ సొమ్ము నాల్లుకు తినాలనేనయ్యా ప్రతివాడి తాప త్రయమూనూ. ఏమైనా కాలం రోజు రోజుకి బొత్తిగా చెడిపోతుందోయ్! లేక పోతే మన కాలంలో ఇన్ని వేషాలు ఎరు గుదుమా చెప్పు?"

"మనుషులే మారుతున్నారు క్షణక్షణా నికీ! ఇక వేషాలో లెక్కా?"

"బాగా చెప్పావ్! నువ్వేమైనా అను గాని ఆడపిల్ల పెళ్ళి చెయ్యకుండా యింట్లో పెట్టుకుంటేనే హాయి దానికీ. మనకీకూడా అన్పిస్తోందోయ్"

"అలా ఎలాలే! కాలంతోబాటే మనమూ మారాలి, తప్పుతుందా చెప్పు."

"నీ వరస నాకేం నచ్చలేదోయ్! మంచిగా మారమంటే మారొచ్చుగానీ దాహాలు తీర్చాలి. వాళ్ళు అడిగినవన్నీ ఇవ్వాలీ అంటే ఏం సబబు చెప్పు?"

అంతలో పరంధామయ్య గారబ్బాయి కాలేజీ నుంచి వచ్చాడు. అతడ్ని చూడ గానే అన్నారు రమణయ్యగారు "అన్నట్టు అబ్బాయికి పెళ్ళి చేసేస్తావా యీ యేడు? మా తోడల్లుడి తరపేదో సంబంధం వుందిలే కనుక్కోమంటేనూ...."

"ఈ సంవత్సరంతో బి. కామ్. అయి పోతుందనుకో— అయినా ఇప్పుడే చేస్తే లాభం లేదోయ్. నా చిన్ననాటి ఫ్రెండొ కడు ఓ బ్యాంకులో మంచి పొజిషన్లో వున్నాళ్ళే. మా వాడికి తప్పకుండా బ్యాంకులో వేయిస్తానన్నాడు. అప్పుడైతే మంచి సంబంధమూ వస్తుంది. మంచి కట్నమూ వస్తుందని చూస్తున్నా...."

మరి మాట్లాడ లేదు రమణయ్యగారు.

## సెల్ఫ్ పిటీ

నా కళ్ళు వాడిపోయిన తొడిమలు
నువ్వు నడిచే దార్లోనే కదా
నా పూలన్నీ రాల్చుకున్నాను
నరాలతో పెదాల్ని బిగదీసి
ఆ షహెనాయీ ఎందుకలా రోదిం
చడం!
నీళ్ళ నునుపు మీద నీటి చుక్క
జారిపడినట్లు
ఒంట్లోని యింట్లో, రివాల్వింగ్ ఛైర్లో
ఒంటరిగా తలొంచుకుని ఏడ్వటం
ఏమిటీ యీ సెల్ఫ్ పిటీ ?
అర్థరాత్రి అద్దం ఏడుస్తున్నట్లు—
సముద్రం పుస్తకాల పుటల్ని
తిరగేస్తుంది
దాని ఏకాగ్రత కేమైనా అంత
రాయమా మనం !
మన సమస్య లెట్లాగూ
యిప్పట్లో తెమిలేట్లు లేవు
ఆ నక్షత్రాల్నెందుకూ యిబ్బంది
పెట్టడం,
వాటినిక నిద్రపొమ్మంటే పోదూ !

—ఖాదర్ మొహియుద్దీన్

